
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 126 వ భాగం

## పురంజనోపాఖ్యానం 19

పురంజనుడనే ఆయన భార్య మీద మమకారంతో, నా తర్వాత ఈవిడ ఏమైపోతుందో అనుకుంటూ పోయాక విదర్భరాజు ఇంట్లో కూతురిగా పుట్టాడు. అలా ఆవిడ వైదర్భి అయింది. మలయధ్వజుడు ఆమెని పెళ్ళి చేసుకున్నాక రాజ్యం పిల్లలకీ అందరికీ ఇచ్చేసి వానప్రస్థం వెళ్ళాడు భార్యతో. అక్కడ ఈ మలయధ్వజుడు కఠోరమైన తపస్సు చేసి భగవంతుణ్ణి చేరుకున్నాడు. భర్త పోయాక ఈ పురంజనుడికి (అదే వైదర్భికి) ఏమౌతుందనేది ఇప్పుడు కనిపిస్తుంది.

క. విను మూష్మత లేకున్నను
గని యూథభ్రష్ట హరిణి కైవడి సతి నె
మ్మనమున బెగడుచు దీనత
ననయంబును బంధురహిత యై శోకించెన్. [4-841]

భర్త శరీరం ముట్టుకుని చూసింది. వేడిగా (ఊష్మత) లేకపోవడం గమనించి ఆయన పోయినట్టు తెల్సుకుంది. వానప్రస్థం వచ్చారు కనక అక్కడ అడవిలో ఎవరూ లేరు (బంధు రహిత). గుంపులోంచి (యూథ) భ్రష్ట (విడిపోయిన) లేడి (హరిణి) లాగా బెదురుతూ దీనంగా ఏడవడం మొదలుపెట్టింది. సహగమనం చేయడానికి ఆయుక్తమైంది.

క. తా ననుగమనము చేయం
బూనుటయును నంతలోనఁ బూర్వసఖుఁడు వి
జ్ఞానస్వరూపుఁ డమలుఁడు
నైన ధరాదివిజుఁ డొక్క డబలం గనుచున్. [4-845]

అప్పుడు పూర్వ సఖుడు అనే విజ్ఞానస్వరూపుడు, స్వచ్ఛమైన వాడు (అమలుడు – అంటే మలినం అంటని వాడు) అక్కడకి వచ్చాడు.  రెండు విషయాలు చూసి ముందుకి సాగుదాం. మొదటిది పూర్వ సఖుడు. కిందటి వ్యాసాల్లో చెప్పినట్టూ మనకి జీవితంలో ఒకే ఒక స్నేహితుడు మనలో ఉన్న ఆత్మ లేదా భగవంతుడు తప్ప మరెవరూ లేరు. ఎన్ని శరీరాలు మారినా మనకూడా వచ్చేది ఈ ఆత్మ ఒక్కటే. ఇంకా కొంచెం విశదంగా చెప్పాలంటే మనమే ఈ ఆత్మ లేదా, అహం బ్రహ్మాస్మి. రెండు లేవు; ఉన్నది కేవలం ఒకటే. ఇదే పూర్వ సఖుడు అనేది. ఈ స్నేహితుడు ఎప్పటికప్పుడు మనని హెచ్చరించినా మనం ఆ హెచ్చరింపు గాలికి వదిలేసి మన ఇష్టం వచ్చినట్టూ చేస్తూ ఉంటాం. అలా చేయడం వల్ల చిక్కుల్లో పడడం, అబద్ధాలు ఆడడం, మళ్ళీ బుద్ధి తెచ్చుకోకుండా అబద్ధాలు వగైరాలతో జీవితం సాగిపోతోంది. ఓ రోజు ప్రాణమే పోతోంది. మళ్ళీ జన్మ, మళ్ళీ మృత్యువు పునఃరపి జననం పునఃరపి మరణం. ఇదే అంతులేని సంసారం అంటే. ఇందులోంచి బయటపడాలంటే ఈవిడ నా భార్య, వీళ్ళు నా వారు, నేనింత గొప్ప అనే అహంకార మమకారాలు పోవాలి. అలా పోయినప్పుడు కలిగేది జ్ఞానం. ఆ జ్ఞానంతో భగవంతుణ్ణి తెలుసుకుంటే అప్పుడు మనం విజ్ఞానులం అవుతాం. అయితే మాయ కమ్మని భగవంతుడు – లేదా మన ఆత్మ, ఎప్పుడూ కూడా విజ్ఞాన స్వరూపి, 'అదే ఆత్మ నేను' అని తెలుసుకుంటే అప్పుడు ఈ సంసారంలోంచి విముక్తి. అందుకే మనలో ఉన్న అంతరాత్మ మనకి ఎప్పుడూ ఉన్న, మన మంచి కోరే పూర్వ సఖుడు. ఈ పూర్వ సఖుడు ఆత్మ కనక అది విజ్ఞాన స్వరూపి. మాయ అంటదు కనక అమలుడు.

క. చనుదెంచి యత్తలోదరి
సునయోక్తుల ననునయించుచుం దగ ననియెన్
"వనితా! నీవెవ్వతె? వె
వ్వని దాన? వితం డెవండు? వగచెద వేలా?" [4-846]

ఇలా వచ్చిన పూర్వసఖుడు నిజం చెప్తున్నాడు వైదర్భితో. నువ్వు ఎవరివి? ఈ పోయిన వాడు ఎవడు? ఎందుకు ఏడుస్తున్నావు? దీని అర్థం ఏమంటే, ఎవరికెవరు? మన కూడా ఎవరో స్నేహితులు కొంతకాలం వస్తారు. వారి దారి వారిది, మన దారి మనదీ. ఆ తర్వాత ఎవర్నో పెళ్ళి చేసుకుంటాం. పిల్లల్ని కంటాం. వీళ్ళందర్లో ఎవరూ మన కూడా వచ్చేవారు కాదు. ఎవరి దారి వారిది. అందుకే ఏడుస్తున్నావు దేనికీ అని అడుగుతున్నాడు.

క. అని యడిగి వెండియును ని
ట్లనియెను నీ సృష్టి పూర్వమందును నీ వె
వ్వనితోడి సఖ్య సౌఖ్యము
లనవరతము ననుభవించి తట్టి సఖుండన్. [4-847]

అదలా ఉంచితే, ఈయన నీ భర్త కాక ముందూ ఈ సృష్టి అంతా లేనప్పుడు (అంటే పూరంజనుడనేవాడు పుట్టకముందే), నువ్వు ఏ సఖుడితో సంతోషంగా ఉన్నావో ఆ సఖుణ్ణి నేనే. నర్మ గర్భంగా చెప్తున్నాడు. ఆత్మ అనేది ఒకటే ఉండేది. అది శరీరంలో ప్రవేశించగానే ఈ పురమే నేను అనే మాయలో పడి ఆత్మని మర్చిపోతున్నాం. అందువల్ల ఈ శరీరానికి పూర్వం ఉన్న ఆత్మ స్వరూపంలో సంతోషంగా ఉండేవాళ్ళం మన ఇద్దరం. ఎక్కడ అనేది, మానవశరీరంలో హంస ఎగిరిపోవడం అనే విషయం ఇప్పుడు చెప్తున్నాడు. హంసో, సోహం అనేదే ఇక్కడ చెప్పేది. దీన్నే మనకి తెల్సినట్టూ "హంస హంసాయ విద్మహే పరమహంసాయ ధీమహి, తన్నో హంసః ప్రచోదయాత్" అనే మంత్రంలో చెప్పుకోవచ్చు. ఈ హంస అనేదే మానవ శరీరంలోని చైతన్యం, మాయ అంటని, మలినం లేని ఆత్మ అనేది. అందువల్ల ఈ హంస అనేది నిత్య సంతోషి, కల్మషం లేనిది.

వ. కావున, నీవును నేనునుం బూర్వంబునందు మానసనివాసులమైన హంసలమై యుండి గృహంబుఁ బాసి సహస్రవత్సరంబులు సఖులమై వర్తించు నంత నీవు నన్నుం బాసి భౌమభోగ రతుండవై పదంబు నిచ్ఛగించుచు మహీమండలంబు గలయం గ్రుమ్మరు నప్పు డొక్క కామినీ నిర్మితంబుం బంచారామంబు నవద్వారసమేతంబు నేకపాలకంబుఁ ద్రికోష్ఠంబు షట్కులంబుఁ బంచవిపణంబుఁ బంచప్రకృతియు స్త్రీనాయకంబు నైన యొక్క పురంబు పొడగంటి; వది యెట్టి దనినం బంచారామంబులనం బంచేంద్రియార్థంబులు; నవద్వారంబులన నాసికాది ద్వారంబు; లేకపాలకంబనం బ్రాణపాలనంబు; త్రికోష్ఠంబులనం దేజో భిన్నంబులు; షట్కులంబులన నింద్రియ సంగ్రహంబు; విపణంబులనఁ గర్మేంద్రియంబులు; పంచప్రకృతి యనం బంచ భూతంబులు; బ్రకృతి యను కామిని యన బుద్ధి; నిట్టి పురంబునం బ్రవిష్టుండైన పురుషుం డంగనా పరతంత్రుఁడు నజ్ఞుండు నైన నీవ యప్పురంబునం గామినీ సంస్పృష్టుండవై రమియించుచుఁ దత్సంగమంబున నష్టస్మృతివై వైదర్భీ జనసంభావిత సుఖాభాసంబులగు దుఃఖంబులచే నిట్టి పాపిష్ఠంబైన దశం బొందితివి; కావున. [4-849]

మన ఇద్దరం మానస సరోవరంలో హంసలుగా ఉండేవాళ్ళం. నన్ను వదిలేసి భోగాలని అనుభవించడానికి నవద్వారాలతో నిర్మితమైన పురం ప్రవేశించావు. ఇక్కడ పంచారామాలు అంటే పంచేంద్రియాలు. శరీరంలో ఉండే రంధ్రాలు నవద్వారాలు. షట్కులం అంటే ఆరు ఇంద్రియాలు (నాలుక, కన్ను, ముక్కు, చర్మం, చెవి, మనస్సు). పంచ ప్రకృతి అంటే పంచ భూతాలు (భూమి, వాయువు, అగ్ని, జలం, ఆకాశం) ఈ పురంలో స్త్రీకాముకుడవై సంతోషం దొరుకుతుందనుకుని ఈ పాపిష్టి దశ పొందావు. అంటే కర్మ వశంగా ఆత్మ శరీరంలో ప్రవేశించింది. ఈ శరీరం కలగడానికి కారణం కూడా ఏదో సుఖం లభిస్తుందనే అనేకానేక కోర్కెలకి కదా?

సీ. నీవు వైదర్భివి గావు; వీరుఁ డితండు–
వివరింపఁగాఁ గాఁడు విభుఁడు నీకు;
నొగి మున్ను పురమున నుపరుద్ధుఁ జేసిన–
యా పురంజన పతి వరయఁ గావు;
మఱియు నీ వన్య సీమంతిని యనియును–
జర్చింపఁగా బూర్వ జన్మమందుఁ
బురుషుం డవనియును బుద్ధిఁ దలంచుట–
యరయంగ నీ యుభయము నసత్య; [4-850]

తే. మింతయును మామకీనమై యెసఁగు మాయఁ
జేసి కల్పిత మయ్యెఁ; జర్చింప మనము
పూర్వమున హంసలమ యని పూని యెఱుఁగఁ
బలికితిఁ దెలియు మనల రూపంబుఁ జూడు. [4-850.1]

అయితే నువ్వు నిజానికి వైదర్భివి కాదు. ఈ పోయిన మనిషి నీకేమీ కాదు. ఈ జన్మలో నువ్వు వనితవనీ ఈయన భార్యని అనీ, క్రితం జన్మలో పురంజనుడవనీ అనుకోవడం కూడా నిజం కాదు. మన నిజ స్వరూపం చూడు.

మరో చిన్న విషయం చెప్పుకుందాం. బ్రహ్మ జ్ఞానం కావాలంటే అన్నీ వదులుకోవాలి కదా? భగవంతుడొకటే నిజం మరేదీ నిజం కాదు. ఈ శరీరం నేను కాదు, ఈ మాయ నేను కాదు, అహం బ్రహ్మాస్మి. ఆ బ్రహ్మం ఎటువంటిదో చూశాం

ఉపనిషత్ శ్లోకంలో. పూర్ణమదః పూర్ణమిదం.. పూర్ణమేవావశిష్యతే." కనిపించని "అది" పూర్తి బ్రహ్మం (ఇదే పూర్వ సఖుడు కథలో). ఈ శరీరంలో ఉన్నఆత్మ కూడా బ్రహ్మం (నేను, కనిపించే "ఇది" కూడా పూర్తి బ్రహ్మం). ఈ కనిపించే బ్రహ్మాన్ని కనుక్కోవాలంటే దానిమీద ధ్యానం చేయాలి. అలా ధ్యానించగా కనిపించే ఈ బ్రహ్మం కూడా పూర్తి ఆనందస్వరూపం. ఇదే మన నిజ స్వరూపం. ఈ శరీరం నేను కాదు, ఈ పోయిన శరీరం నా భర్త కాదు అనుకుంటూ చూస్తే నేను ఈ అత్మ ఒకటే అనే ఎరుక వల్ల మనం హంసలము అని తెలుసుకోవడమే బ్రహ్మ జ్ఞానం కలగడం. కనిపించేది ఏదీ నేను కాదు, ఇది ఆత్మ కాదు అనుకుంటూ ఉండడాన్నే జ్ఞానయోగులు 'నేతి నేతి' (ఇది కాదు, ఇది కాదు) అంటారు. ఇదే పూర్వసఖుడు చెప్పే జ్ఞాన బోధ. ఇంతా చేస్తే జ్ఞానం కలిగాక తెలిసేది ఏమిటి? అది ముందు చెప్తున్నాడు. భగవంతుడూ, నీలో ఉన్న ఆత్మ వేరు వేరు కాదు.

వ. ఏనే నీవు గాని యన్యుండవు గావు; నీవే నేఁ గాని యన్యుండంగా; నిట్లని యెఱుంగుము; విద్వాంసులు మన యిద్దఱ యందు నంతరంబు నీక్షింపరు; పురుషుండు దన్నొక్కనినె యాదర్శ చక్షువులందు భిన్నరూపునింగాఁ దలంచు చందంబున మన యిద్దఱికిని భేదంబు గలిగిన యట్ల తోఁచు; నని యివ్విధంబున నతం డతనిచేత నీవు పూర్వంబున
మదీయసఖుండవైన హంస" వని తెలుపంబడి స్వస్థుండై తద్వియోగ నష్టంబైన జ్ఞానంబు గ్రమ్మఱం బొందె" నని చెప్పి నారదుండు ప్రాచీనబర్హిం జూచి యీ యధ్యాత్మతత్త్వంబు రాజకథామిషంబున నీకు నెఱింగించితి;" ననిన. [4-851]

నువ్వే నేను కానీ మన ఇద్దరం వేరు వేరు కాదు. అలా తెలుసుకున్న విద్వాంసులు వేరు వేరు అని చూడరు. అంటే మనలోని ఆత్మ, భగవంతుడు ఎప్పుడూ వేరువేరుగా లేవు. అసలు రూపం, ప్రతిబంబించే రూపం వేరువేరుగా ఉన్నట్టు కనిపించినా నిజానికి రెండూ ఒకటే కదా? అలా జ్ఞాన బోధ చేసేసరికి కళ్ళు తెరుచుకున్నాయి వైదర్భికి. వెంతనే జ్ఞానమార్గం అవలంబించి మర్చిపోయిన (తద్వియోగ నష్టంబైన జ్ఞానంబు) జ్ఞానాన్ని అన్వేషించి దాన్ని పొందాడు. ఇది అధ్యాత్మతత్త్వం, రాజు కథ అన్నట్టు మార్చి నీకు చెప్పాను అని నారదుడు ప్రాచీనబర్హితో చెప్పాడు.

చిన్న వివరణ చూద్దాం మళ్ళీ. అనేకానేక జన్మలు గడిచాక పుణ్యం వలన భగవంతుడు అంటే ఇదీ అని, ఈ ధ్యానం జ్ఞానం వల్ల కలిగే విజ్ఞానం మాత్రమే అసలు సుఖం అందించేది అని తెలుస్తుంది. అలా కొన్ని జన్మలు గడిచాక గురువు అనే ఆయన/ఆవిడ దగ్గిర తేల్తాం. ఈ గురువులు బ్రహ్మజ్ఞానం సంపాదించారు కనక వాళ్ళొచ్చి 'ఈ శరీరం నువ్వు కాదు, అహం బ్రహ్మస్మి అనుకుంటూ మొదలుపెట్టు, అసలు నాలో ఉన్న బ్రహ్మం, నీలో ఉన్న బ్రహ్మం ఒకటే. ఇద్దరం వేరు కాదు పైకి అలా కనిపించినా' అని జ్ఞాన బోధ చేసాక మనం అసలు సిసలు దారిలో పడి మొదట్లో కర్మ, భక్తి తర్వాత ధ్యానం అనే

యోగాలన్నీ అయ్యాక జ్ఞానం అపైది విజ్ఞాన యోగం (భగవద్గీతలో అధ్యాయాలు ఇదే వరసలో చూడవచ్చు) అందుకోగలం. కథలో చెప్పిన ఈ పూర్వసఖుడే గురువు, లేదా భగవంతుడు. ఈ కథ చెప్పడానిక్కారణం కూడా చెప్తున్నాడు నారదుడు. 'ఈ శరీరమే నేను అనుకుంటూ ఇన్నాళ్ళూ యజ్ఞాలు చేస్తున్నావు. వీటివల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదు. భగవంతుడి గురించి మర్చిపోయినందుకు నవద్వారం అనే పురం అని కథ ఒకటి కల్పించి చెప్పాను.' మనకి అదృష్టం కల్సి వచ్చినప్పుడు ఇటువంటి గురువులు వచ్చి జ్ఞానబోధ చేస్తారు. అలా ప్రాచీనబర్హి కి నారదుడు వివరించి చెప్పాడు – లేదా యోగ మార్గం చూపించాడు.

ఇదంతా ఎందుకంటే ప్రాచీనబర్హికి పుట్టిన పిల్లలు పరమేశ్వరుడి ద్వారా ఉపదేశం పొంది తపస్సు చేస్తూంటే ఈయన ఇంకా ఇలా యజ్ఞాలు చేస్తున్నాడు కానీ భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ఏమీ ప్రయత్నం చేయడం లేదు. అందువల్ల నారదుడు లేదా ఆది గురువు వచ్చి ఉపదేశం ఇచ్చాడు. అయితే కథ రాజుకి అర్థమైనా భాగవతం చదివే వినే అందరికీ అర్థం కాదు కనక రాజు అడిగాడు – 'అలా కథ టూకీగా చెప్పేస్తే మాలాంటి వాళ్ళకి నిగూఢమైన అర్థాలు చేరవు కనక బాగా విడమర్చి చెప్పండి' అని. ఈ పురం అంటే ఏమిటి అనేది ఈ సరికి మనకి అర్థమైంది కదా? మానవ శరీరమే. మిగతా గూఢంగా దాగి ఉన్న విషయాలు నారదుడు ఎలా వివరిస్తాడో వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS